అంధకారంలో జాతీయ రహదారి

- ప్రతిపాదనలకే పరిమితమైన అభివృద్ధి
- వాహనాల వేగ నియంత్రణకు చర్యలు శూన్యం
- ఏడాదిలో 31 ప్రమాదాలు.. ఏడుగురు దుర్మరణం
- రహదారి భద్రత గాలికొదిలిన అధికారులు


తిరువూరు బైపాస్ రోడ్డులో వీధి లైట్లు లేకపోవడంతో అలముకున్న చీకటి

తిరువూరు: ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ 30వ నంబర్ జాతీయ రహదారి తిరువూరు నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల ప్రమాదాలకు నెలవుగా మారింది. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద న్యాయ వివాదాల కారణంగా అసంపూర్తిగా రహదారి నిర్మాణం నిలిచిపోగా.. తిరువూరు పట్టణ పరిధిలో ఈ జాతీయ రహదారి వెళ్లే బైపాస్‌రోడ్డు ట్రాఫిక్‌కు అనుగుణంగా లేకపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. గత ఏడాది కాలంలో ఈ రహదారిపై 31 ప్రమాదాలు జరగగా, ఏడుగురు వాహన చోదకులు మృత్యువాత పడ్డారు. 18 మంది క్షతగాత్రులయ్యారు. జాతీయ రహదారికి జనావాసాలున్న ప్రాంతాల్లో డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా తిరువూరు పట్టణంలో మాత్రం ఈ నిబంధనను విస్మరించారు. తిరువూరు నియోజకవర్గంలో 25 కిలో మీటర్ల పరిధిలో ఈ రహదారి 8 చోట్ల ప్రమాదాలకు నెలవుగా ఉందని గుర్తించిన జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ తదనుగుణంగా జాగ్రత్త చర్యలు చేపట్టలేదు.

అపరిమిత వేగంతో వాహనాల రాకపోకలు

తిరువూరు పట్టణంలోని బైపాస్ రోడ్డును జాతీయ రహదారికి అనుసంధానం చేయడంతో అపరిమిత వేగంతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. బైపాస్ రోడ్డులోని చర్చి సెంటర్, తోకపల్లి సెంటర్, క్లబ్ సెంటర్, మిల్లు సెంటర్లలో వీధి లైట్లు లేకపోవడంతో చీకటిమయంగా ఉన్న రహదారిపై రాత్రి వేళ ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో నగర పంచాయతీ ఈ రహదారిపై వీధి లైట్ల ఏర్పాటుకు ప్రతిపాదించినా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆమోదం రాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఈ రహదారిపై వేగ నియంత్రణకు సైతం ఎటువంటి చర్యలూ తీసుకోని కారణంగా ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



తిరువూరు బైపాస్ రోడ్డుకు ఇరువైపులా నివాస ప్రాంతాలు ఉన్నప్పటికీ వీధి లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ రోడ్డుపైకి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఫలితం లేదు.

– పరసా సెమ్రాజీ, తిరువూరు

వేగ నియంత్రణకు చర్యలు శూన్యం



జాతీయ రహదారిపై పలుచోట్ల ప్రమాదాలు జరుగుతున్నా వేగ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం తగదు. ప్రమాదకర మలుపుల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. తిరువూరు పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డును వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

– యరదేశి రామారావు, తిరువూరు

ముందస్తు ప్రణాళికలతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ఆర్డీఓ కావూరి చైతన్య

జి.కొండూరు: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆర్డీఓ కావూరి చైతన్య అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా జి.కొండూరు పీఏసీఎస్ భవనంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్డీఓ మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పటిష్ట ప్రణాళికను రూపొందించి ధాన్యం కొనుగోళ్లు జరపాలన్నారు. వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకుంటూ వరి కోతలు జరిపేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ధాన్యం సేకరించేందుకు అవసరమైన గన్నీ బ్యాగులు, మాయిచ్చర్ చెకింగ్, రవాణాకు అవసరమైన లారీలు, రైస్‌మిల్లుల సన్నద్ధత వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త పడాలన్నారు. మండల వ్యవసాయాధికారి సూరిబాబు మాట్లాడుతూ జి.కొండూరు మండల పరిధిలోని పది పీఏసీఎస్‌లలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మండల పరిధిలోని కుంటముక్కల, గుర్రాజుపాలెం రైస్‌మిల్లులతో పాటు ఇతర మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



జి.కొండూరు: స్టేట్ టీచర్స్ యూనియన్ మండల నూతన కార్యవర్గం ఎన్నికైందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహ ప్రసాద్ తెలిపారు. వెలగలేరు కమ్యూనిటీహాల్‌లో ఎస్టీయూ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా ఎం.అనంతబాబు, ప్రధాన కార్యదర్శిగా డి.శాంతరాజు, ఆర్థిక కార్యదర్శిగా వై.మోహన్ రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా వీఎస్ఎస్ సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా కె.సురేష్‌బాబు, కార్యదర్శిగా జోసెఫ్, మహిళా కార్యదర్శులుగా వి.జయశ్రీ, ఎ.శిరీష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన వివరించారు.

కరాటేలో సత్తా చాటిన తిరువూరు విద్యార్థులు



తిరువూరు: ఈ నెల 11, 12 తేదీల్లో చెన్నైలో జరిగిన ఆలిండియా కరాటే చాంపియన్ షిప్‌లో తిరువూరు సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రీతి తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులు సిరాజ్, అక్షయ్, వాసికర్, సాత్విక్, తనిష్‌లను, కోచ్ మోతే నాగేశ్వరరావును అభినందించారు. 15 రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ జ్యోత్స్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉపాధ్యాయులకు అభినందన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): డీఎస్సీ ద్వారా కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో నూతనంగా జాయిన్ అయిన ఉపాధ్యాయులకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.భవానీ, సంఘవిలకు ఎస్టీయూ తరఫున నూతన సర్వీస్ రిజిస్టర్లు బహూకరించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిదేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఎస్టీయూ నాయకులు గోపాలకృష్ణ, ప్రమీల, జనార్దనరావు, అమర్‌నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నప్రసాద వితరణ

తిరువూరు: స్థానిక స్వామి అయ్యప్ప దేవాలయంలో గురువారం నుంచి దీక్షాపరులకు అన్నప్రసాద వితరణ చేస్తామని ఆలయ చైర్మన్ సంకా రాజారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప, భవానీ, శైవ దీక్షాపరులకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు తమ దేవాలయంలో టోకెన్లు జారీ చేస్తామని, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. భక్తులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్రమం డిసెంబరు 27 వరకు కొనసాగుతుందన్నారు.

పరిశుభ్రత పాటించాలి



పుట్రేల(విస్సన్నపేట): ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంఈఓ–1 కె. శంకరరావు అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమం బుధవారం పుట్రేల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భోజనానికి ముందు, తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలని, దీనివలన వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. విద్యార్థులకు చేతులను శుభ్రం చేసుకోవడాన్ని చూపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకరరెడ్డి, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను కృష్ణలంక పోలీసులు కాపాడారు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్‌పై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇబ్రహీపట్నంకు చెందిన షేక్ సాహిద, చాంద్‌బాషా భార్యాభర్తలు. వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన సాహిద చనిపోవాలని నిర్ణయించుకుని బుధవారం ఉదయం ఇంటిలో చెప్పకుండా నగరంలోని బస్టాండ్ ప్రాంతానికి చేరుకుంది. కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవాలని మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రైల్వే ట్రాక్ మీదకు చేరుకుంది. ఈ సమాచారం అందుకున్న కృష్ణలంక కానిస్టేబుళ్లు నాగుల్‌మీరా, రాంబాబు ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న సాహిదను కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆడపిల్లలకు అవకాశాలు కల్పించాలి

డెప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి


మాట్లాడుతున్న డెప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి

నూజివీడు: నేటి ఆధునిక యుగంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నందున వివక్ష చూపొద్దని నూజివీడు డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. పద్మావతి అన్నారు. పట్టణంలోని త్రివిధ హైస్కూల్‌లో వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, వారికి అవకాశాలు కల్పిస్తే అన్నిరంగాల్లో రాణిస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలకు ఇంకా బాల్య వివాహాలు చేస్తున్నారని, దీనివల్ల వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసినవారవుతారన్నారు. ఆడపిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని చెప్పారు. కోనేరుపేట యూపీహెచ్‌సీ వైద్యురాలు సాయిసుధ, ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి


మాట్లాడుతున్న అధికారులు

ఆగిరిపల్లి: ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన బేటీ బచావో–బేటి పడావో కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ బి.భార్గవి పాల్గొని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికీ సమాజంలో ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేస్తున్నారని, ఇది బాలికల హక్కులకు భంగం కలిగించడమే అని చెప్పారు. ఆడపిల్లలు 21 సంవత్సరాలు వచ్చే వరకు వివాహాలు చేసుకోరాదని సూచించారు. ఎంపీడీఓ భార్గవి మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకోవడం వలన గర్భవతులైతే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, యుక్త వయస్సు వచ్చిన తర్వాతే వివాహం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జాస్తి జగన్‌మోహన్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

దుకాణాల ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన అధికారులు



వ్యాపారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ బద్రూ, కమిషనర్ వెంకటరామిరెడ్డి

నూజివీడు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ గుగులోతు బద్రూనాయక్, ఆర్. వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. దీపావళి సందర్భంగా తాత్కాలికంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయనున్న విస్సన్నపేట రోడ్డులోని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆవరణను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో వారు మాట్లాడుతూ రేకులతో తాత్కాలిక షెడ్లను నిర్మించుకోవాలని, త్వరగా మండే స్వభావం కలిగిన నాసిరకం సామగ్రిని అమ్మవద్దన్నారు. ప్రతి షాపునకు కనీసం మూడు అడుగుల దూరం ఉండాలని, ప్రతి దుకాణం వద్ద నీళ్లు, ఇసుకతో పాటు ఫైర్ సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు అగ్నిమాపక కేంద్రం ఫోన్ నంబరును దుకాణాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. పోలీస్, మున్సిపల్, తహసీల్దారు, ఫైర్ అధికారుల నుంచి అనుమతి పత్రాలు తీసుకుని దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ ఎస్ఐ కె. నాగేశ్వరరావు, ఫైర్ ఆఫీసర్ బి. నాగరాజు, దుకాణదారులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

విస్సన్నపేట: దీపావళి పండుగ సందర్భంగా విస్సన్నపేటలో బాణసంచా విక్రయ దుకాణాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు బుధవారం స్థానిక పాతమిల్లు వద్ద ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఆర్ఐ సుజాత, పీఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి, అగ్నిమాపక అధికారి భరత్ భూషణ్ పాల్గొన్నారు. బాణసంచా దుకాణాల యజమానులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వారు పేర్కొన్నారు.


సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

తిరువూరు: విద్యార్థులు సైబర్ నేరగాళ్ల మాయలో చిక్కుకుని మోసపోవద్దని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. తిరువూరు నాగార్జున కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల గుర్తింపు, కట్టడిపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉచితంగా డబ్బులు వస్తాయని మాయమాటలు చెప్పడం, గేమ్స్ యాప్స్ పేరుతో లింకులు పంపించి నేరగాళ్లు వ్యక్తిగత సమాచారం తస్కరిస్తారన్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా సెల్‌ఫోన్‌లో ఎటువంటి లింకులను ఆపరేట్ చేయవద్దని చెప్పారు. మాయమాటలతో బురిడీ కొట్టించేందుకు యత్నించే మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండి వారి వివరాలను పోలీసుస్టేషన్‌లో అందిస్తే సైబర్ నేరాలను నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐ విచారణ జరపాలి


సమావేశంలో మాట్లాడుతున్న కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు

మైలవరం: నకిలీ మద్యం పట్టుకున్నందుకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్‌పై ద్వేషం పెంచుకుని చంద్రబాబు, నారా లోకేష్‌లు కేసులో ఇరికించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్ సీపీ రెడ్డిగూడెం మండల అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. రెడ్డిగూడెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు వేల కోట్ల విలువ చేసే నకిలీ మద్యం కుంభకోణానికి సూత్రధారి, పాత్రధారి ఎవరు అనేది తెలియాలంటే సీబీఐ విచారణ వేయాలని, దీనికి కూటమి ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు టీడీపీ నేత జనార్దన్ అని, అతని వెనుక కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. జోగి రమేష్‌కు, జనార్ధన్‌కు సంబంధాలు ఉన్నాయని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆరోపిస్తున్నారని, నీకు నీ బావమరిదికి అతనితో సంబంధాలు లేవని రుజువు చేయగలవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేశానికి అబ్దుల్ కలాం సేవలు ఎనలేనివి

జయంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి


మద్దాయికుంట హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


పెనుగొలనులో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నూజివీడు: భారత మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం దేశానికి అమూల్యమైన సేవలు అందించారని పలువురు వక్తలు అన్నారు. అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాలు పలు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూజివీడు మండలం మద్దాయికుంట జెడ్పీ హైస్కూల్‌లో అబ్దుల్ కలాం చిత్రపటానికి హెచ్‌ఎం దారపురెడ్డి భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అబ్దుల్‌కలాం జీవితం యువతకు ఆదర్శనీయమన్నారు. ఆయన మిస్సైల్ మ్యాన్‌గా, రాష్ట్రపతిగా దేశానికి విలువైన సేవలను అందించారని కొనియాడారు. విద్యార్థులు అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నవరం హైస్కూల్‌లో...

నూజివీడు మండలం అన్నవరం హైస్కూల్‌లో కలాం చిత్రపటానికి హెచ్‌ఎం జి. విజయకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అబ్దుల్‌కలాం జీవిత చరిత్రపై వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి

తిరువూరు: మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని గంపలగూడెం మండలం పెనుగొలను షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం చేసిన సేవలను కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణరావు వివరించారు. విద్యార్థులు, పలువురు కమిటీ సభ్యులు కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- **ఇబ్రహీంపట్నం:** కాచవరం ఎంపీపీ పాఠశాలలో కలాం చిత్రపటానికి ప్రధానోపాధ్యాయిని భవానీ పూలమాల వేసి నివాళులర్పించారు. కలాం సేవలను విద్యార్థులకు వివరించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి సాయం

మైలవరం: మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన అగ్నిబాధితుడు చలమచర్ల మధు కుటుంబానికి వెల్వడం గ్రామ వాసి, ప్రవాసాంధ్రులు డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి బుధవారం సాయం అందజేశారు. ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో మధు ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అనిల్‌కుమార్‌రెడ్డి సరస్వతీ ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.20,116 విలువ చేసే ఇంటికి కావాల్సిన రేకులు, దూలాలు, సిమెంట్ స్తంభాలు తదితర సామగ్రిని ఆయన మేనల్లుడు సీతారామిరెడ్డి ద్వారా అందజేశారు.

19న ప్రమాణ స్వీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా దేవతి భగవన్నారాయణ ఈ నెల 19న మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారని ఆర్యవైశ్య మహాసభ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కోట ఉదయ్ కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనతోపాటు రాష్ట్ర కార్యవర్గం, వివిధ జిల్లాల అధ్యక్షులు కూడా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. డీబీఎస్ ఫౌండేషన్ స్థాపించి పేదలకు ఉచిత వివాహాలు, తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న దేవతి భగవన్నారాయణ ఏపీలోని ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలకు వినతి

ఇబ్రహీంపట్నం: సామాజిక మాధ్యమాల వేదికగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, తనపై తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ బావమరిది పోసాని కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. విజయవాడలో పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ రాజశేఖర్ బాబుకు బుధవారం ఫిర్యాదు చేశారు. నకిలీ మద్యంలో తమ ప్రమేయం ఉందంటూ వాట్సాప్ వేదికగా తప్పుడు వీడియోలు సృష్టించి ప్రచారం నిర్వహిస్తున్నారని, వారిని గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని కోటేశ్వరరావు సీపీని కోరారు. వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

మీర్జాపురం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మీర్జాపురం హైస్కూల్ విద్యార్థులు

నూజివీడు: నూజివీడులో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల్లో మీర్జాపురం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కోనేరు శ్రీదేవి బుధవారం తెలిపారు. హైస్కూల్‌కు చెందిన బాలబాలికలు వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, రన్నింగ్ వంటి క్రీడల్లో ప్రతిభ చూపారని చెప్పారు. బాలుర సీనియర్స్‌లో కలపాల హర్షవర్ధన్, నీలాపు కోటేశ్వరరావు, నందేటి కార్తీక్, నాగెళ్ల అజయ్, నల్గొండ విక్రమ్, చల్లా అభి, గొట్టపు కార్తీక్ ప్రతిభ కనబరిచారన్నారు. జూనియర్స్‌లో లంకా సాకేత్, వీర్ల కల్యాణ్, యలమర్తి రాజేష్, బాలికల సీనియర్స్‌లో బుద్దుల శ్రావ్య, గండికోట భవానీశ్రీ, బాలికల జూనియర్స్‌లో చేప సింధూర, పరసా హర్షిణి ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

25లోగా ఈక్రాప్ నమోదు పూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

నూజివీడు: ఈక్రాప్ నమోదు కార్యక్రమం ఈనెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా పేర్కొన్నారు. మండలంలోని తుక్కులూరు రైతు సేవా కేంద్రంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందితో ఈ పంట నమోదుపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూజివీడు మండలంలో ఇప్పటివరకు 98 శాతం ఈ క్రాప్ నమోదు పూర్తి చేశారని, మిగిలిన రెండు శాతాన్ని కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పంటలు సాగు చేయని భూములను సైతం ఈ పంటలో నమోదు చేయాలని చెప్పారు. అనంతరం మార్కెట్ యార్డులో ఉన్న భూసార పరీక్షా కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏడీఏ సుబ్బారావు, ఏఓ పలగాని చెన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

- **ఆగిరిపల్లి:** ప్రతి రైతు బాధ్యతగా ఈ పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. బుధవారం వడ్లమాను రైతు సేవా కేంద్రంలో ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జీలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25వ తేదీలోగా ఈ పంట నమోదు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ వై.సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని, ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా లీగల్ సెక్రటరీగా పల్లెపాటి

తిరువూరు: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్టీఆర్ జిల్లా చీఫ్ లీగల్ సెక్రటరీగా తిరువూరుకు చెందిన న్యాయవాది పల్లెపాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు సంపత్‌కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేశారని ఉపాధ్యక్షుడు గంజా కృష్ణమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మైలవరం: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న దివ్యాంగులు వివిధ రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక ప్రతినిధులతో ప్రభుత్వం జరిపే చర్చల్లో దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులను కోరారు. గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగులకు క్షేత్రస్థాయి విధులు, ఆధార్ సెంటర్స్, బీఎల్ఓ డ్యూటీలు, ఇన్‌చార్జి డ్యూటీల నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగ ఉద్యోగులకు, దివ్యాంగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ ప్రక్రియలో దివ్యాంగ ఉద్యోగులను మిగులు ఉద్యోగులుగా చూపించి వారి మాతృశాఖలో విలీనం చేసి ప్రభుత్వ కార్యాలయంలోనే వారి అంగవైకల్యానికి తగ్గట్టు సిట్టింగ్ పోస్టులు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్వర్గపురికి ఫ్రీజర్‌బాక్సు వితరణ

తిరువూరు: స్థానిక మునుకుళ్ల రోడ్డులో పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహిస్తున్న స్వర్గపురి స్మశానవాటికకు ప్రముఖ వ్యాపారి నాళ్లా సాయిప్రసాద్ ఫ్రీజర్ బాక్స్ వితరణగా ఇచ్చారు. రూ.90 వేల విలువైన ఈ బాక్సును స్వర్గపురి నిర్వాహకులకు బుధవారం అందజేశారు.